

ధర్మారంలో భోగి మంటలు.. బసవన్న



కామారెడ్డి పట్టణంలోని ఓ కాలనీలో ముగ్గులు వేస్తున్న చిన్నారులు

సొంతూరిలోనే సంక్రాంతి సంబురం

# పండుగొచ్చె.. పల్లె పిలిచే!

- పల్లెకు చేరిన పట్టణం
- స్వస్థలాలకు వచ్చిన విద్యార్థులు, ఉద్యోగులు, వ్యాపారులు
- మూడు రోజులపాటు కుటుంబీకులతో కలిసి వేడుకలు
- ఏడాది దాక పదిలంగా పండుగ జ్ఞాపకాలు
- ఉమ్మడి కుటుంబ స్ఫూర్తిని చాటుతున్న పల్లె జీవనం



సుభాష్‌నగర్, జనవరి 13: తెలుగు ప్రజల సంస్కృతీ సంప్రదాయాల్లో సంక్రాంతి పండుగకు విశిష్ట స్థానం ఉన్నది. తెలుగు వారి సంప్రదాయంలో పెద్ద పండుగ. సంక్రాంతికి సెలవులు వచ్చాయంటే చాలు విద్య, ఉద్యోగ, ఉపాధి నిమిత్తం వివిధ ప్రాంతాల్లో ఉంటున్న వారంతా తమ స్వస్థలాలకు చేరుకుంటారు. విద్యాసంస్థలకు శనివారం నుంచి సంక్రాంతి సెలవులు మొదలు కావడంతో పిల్లలను చదివించేందుకు పట్టణ ప్రాంతాల్లో ఉంటున్న తల్లిదండ్రులు కుటుంబ సమేతంగా పల్లె బాట పడుతున్నారు. పండుగ సెలవులను సొంతూరిలో గడపాలన్న ఆసక్తితో వెళ్తున్నారు. భోగి, సంక్రాంతి, కనుమ పర్వదినాలను కుటుంబసభ్యులతో కలిసి ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు. ఇక్కడి కుటుంబ పెద్దలు తమ మనుమలు, మనుమరాళ్లతో సరదాగా గడుపుతూ మురిసిపోతున్నారు.

## అంతా ఒకచోటికి చేరి.. ఉమ్మడి కుటుంబ స్ఫూర్తిని చాటి..

అందరినీ ఒక్కటి చేసే పండుగ సంక్రాంతి. ఎక్కడెక్కడో ఉన్నవారందరినీ పల్లెలు, గ్రామాలకు తీసుకెళ్లి మూలాల్ని గుర్తుచేసే మహోత్సవం. ఉద్యోగ, వ్యాపారాల్లో తలమునకలై ఉన్నా, ఎక్కడో సుదూరాన ఉన్నా సంక్రాంతి వచ్చిందంటే అంతా ఒక చోటికి చేరుతారు. సొంతూరిలో సంబురాల్లో మునిగితేలుతారు. పిల్లపాపల రాకతో పెద్దలు కూడా పిల్లలైపోతారు. కనుమరుగవుతున్న ఉమ్మడి కుటుంబాల స్ఫూర్తిని మూడు, నాలుగురోజులపాటు మళ్లీ ఆవిష్కరించే పండుగ సంక్రాంతి. మూడు రోజుల ముచ్చటైన వైభోగం పల్లెలోగిళ్లలోనే కనిపిస్తుంది. ఒక్క మాటలో చెప్పాలంటే సంక్రాంతి భావోద్వేగాల పండుగ. మళ్లీ ఏడాది దాక ఆ జ్ఞాపకాలను పదిలంగా దాచుకునేలా చేసే పర్వదినం. ముంగిళ్లలో ముత్యాల ముగ్గులు పరుచుకుంటాయి. డూడూ బసవన్నల సవ్వళ్లు.. హరిదాసుల కీర్తనలు.. ఘుమఘుమలాడే పిండివంటలు.. సంక్రాంతి ప్రత్యేకతలు.



బోధన్‌లో భోగి మంటలు..





రుద్రూర్‌లో..

బసవన్నను మొక్కుతున్న చిన్నారి

### నాలుగు రోజులు ఇండ్లల్లో సందడే సందడి



డిచ్‌పల్లి, జనవరి 13 : సంక్రాంతి అందరికీ ఇష్టమైన పండుగ. మా గ్రామంలో సంక్రాంతి పండుగను అందరం కలిసి ఆనందంగా జరుపుకుంటాం. ఒక రోజు ముందుగానే ప్రత్యేకంగా పిండి వంటలు తయారు చేసుకుంటాం. మూడు నాలుగు రోజుల పాటు ఇండ్లలో పండుగ సందడి ఉంటుంది. దూరప్రాంతాల నుంచి కుటుంబ సభ్యులు పండుగకు ఇంటికి రావడం ఆనవాయితీగా వస్తున్నది.

-నాగలక్ష్మి, గృహిణి, ధర్మారం(బీ)

### వారం రోజుల నుంచే పిండి వంటలు సిద్ధం



మకర సంక్రాంతి వస్తుందంటే చాలు.. రకరకాల పిండి వంటకాలను తయారు చేసేందుకు సిద్ధమవుతాం. ముఖ్యంగా అరిసెలు, చెక్కలు, పొంగలి, జంతికలు, కారప్పూస తదితర పిండివంటలు వారం రోజుల ముందు నుంచే తయారు చేస్తారు. సంక్రాంతి ముందు రోజు భోగి మంటలు వేసి పిల్లలకు భోగి పండ్లు పోస్తాం.

-సాత్విక, ధర్మారం(బీ)

### దూర ప్రాంతాల నుంచి వస్తారు..



ప్రతి ఏటా సంక్రాంతి పండుగను కుటుంబ సభ్యులు, బంధు మిత్రులతో కలిసి ఆనందంగా జరుపుకొంటాం. సంక్రాంతి వచ్చిందంటే చాలు ఊరంతా పండుగ హడావుడి కన్పిస్తుంది. దూర ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా సంక్రాంతి వేడుకలకు కుటుంబసభ్యులతో కలిసి గ్రామాలకు చేరుకుంటారు. వారం రోజుల పాటు వేడుకల్లో పాల్గొని తిరిగి వారి ప్రాంతాలకు వెళ్తారు.

- సుబ్బారావు, ధర్మారం(బీ)

### సొంతూరు కన్నతల్లితో సమానం



సొంతూరు కన్నతల్లితో సమానం. మచిలీపట్నంలో మొదటి సంవత్సరం ఎంబీఏ చేస్తున్నాను. ఆరు నెలల తర్వాత సంక్రాంతి పండుగకు మాఊరు రెంజల్‌కు వచ్చాను. కుటుంబ సభ్యులతో పండుగ జరుపుకోవడం ఆనందంగా ఉంది.

- శరణ్య, ఎంబీఏ విద్యార్థిని

### పండుగకు నానమ్మ దగ్గరికే వెళ్తా.



ప్రతి సంవత్సరం సంక్రాంతి పండుగను మా నానమ్మ ఊరు ఖానాపూర్‌లో జరుపుకుంటాం. ఈ సారి కూడా వచ్చాను. పల్లె వాతావరణం, తాత నానమ్మల ఆత్మీయత ఆనందాన్ని కలిగిస్తాయి. చిన్ననాటి మిత్రులతో కలిసి పతంగులు ఎగరవేయడం ఎంతో సంతోషాన్నిస్తుంది.

-ఆకాశ్, బీటెక్ విద్యార్థి

# భూమి విషయమై గొడవ

- ఇరువర్గాల మధ్య ఘర్షణ.. ఒకరికి గాయాలు
- పోలీసులకు పరస్పర ఫిర్యాదులు

నాగిరెడ్డిపేట, జనవరి 13: గ్రామానికి చెందిన భూమిలో పంట సాగు చేస్తుండడంపై ఘర్షణ చోటుచేసుకున్నది. పంట సాగుచేస్తున్న వారికి, గ్రామస్తులకు మధ్య తలెత్తిన వాగ్వాదం ఘర్షణకు దారి తీయగా.. ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలంలోని వెంకంపల్లి గ్రామంలో సోమవారం చోటుచేసుకున్నది. గ్రామస్తులు, ఎస్సై మల్లారెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామ శివారులోని మంజీరా పరీవాహక ప్రాంతం లో ఉన్న శిఖం భూమి(పదెకరాల స్థలం)ని కొన్నేండ్ల క్రితం గ్రామ అవసరాల కోసం కేటాయిస్తూ తీర్మానం చేశారు. శిఖం భూమిలో గ్రామానికి చెందిన అన్నదమ్ములైన జమాకర్‌రెడ్డి, కమాల్‌రెడ్డి పంట సాగుచేస్తుండడం కొందరు గ్రామస్తులు సోమవారం అక్కడికి చేరుకొని పనులను నిలిపివేశారు.దీంతో ఇరువర్గాల మధ్య తీవ్ర స్థాయిలో ఘర్షణ చోటు చేసుకున్నది. ఘర్షణలో సురేందర్‌రెడ్డి అనే వ్యక్తికి గాయాలయ్యాయి. గ్రామం కోసం కేటాయించిన భూమిలో జమాకర్‌రెడ్డి, కమాల్‌రెడ్డి అక్రమంగా సాగు చేసుకుంటున్నారని, అడిగితే తనపై దాడి చేశారంటూ సురేందర్‌రెడ్డి గ్రామస్తులతో కలిసి స్థానిక ఎస్సై మల్లారెడ్డికి ఫిర్యాదు చేశాడు. సురేందర్‌రెడ్డి తమను కొట్టినట్లు జమాకర్‌రెడ్డి కుటుంబ సభ్యులు కూడా ఫిర్యాదు చేశారు. కొన్నేండ్లుగా తాము ఈ భూమిని సాగు చేసుకుంటున్నామని, తమపై కొందరు గ్రామస్తులు కక్షగట్టి దాడి చేశారని జమాకర్‌రెడ్డి కుటుంబసభ్యులు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఇరువురి ఫిర్యాదులపై విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు.

# జీజీహెచ్ సూపరింటెండెంట్‌పై వేటు

- ప్రతిమారాజ్‌ను తప్పించిన ప్రభుత్వం
- ఇటీవల దవాఖానలో ఘనంగా బర్త్‌డే వేడుకలు
- ఆమె హయాంలో జరిగిన టెండర్లపై విచారణకు ఆదేశం



ఖలీల్‌వాడి, జనవరి 13: నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ దవాఖాన (జీజీహెచ్) సూపరింటెండెంట్ డాక్టర్ ప్రతిమారాజ్‌పై వేటు పడింది. ఆమె వ్యవహార శైలిపై అనేక ఫిర్యాదులు రావడంతో ప్రభుత్వం ఆమెను బాధ్యతల నుంచి తప్పిస్తూ సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే ప్రతిమారాజ్ హయాంలో జరిగిన కార్యకలాపాలపై విచారణకు ఆదేశించింది. ఇటీవల నిబంధనలకు విరుద్ధంగా ప్రభుత్వ దవాఖానలో ఘనంగా ఆమె పుట్టినరోజు వేడుకలు జరుపు కోవడం, సిబ్బంది నుంచి కానుకలు పొందడం, రోగుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వైనం రాష్ట్ర వ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ ఘటనను సీరియస్‌గా పరిగణించిన వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ సూపరింటెండెంట్‌పై ఆగ్రహం వ్యక్తం చేయడంతో పాటు ఆమె హయాంలో వెలువడిన టెండర్లు, ఇతర పనులపై విచారణకు ఆదేశించారు. రోగుల అవస్థలను పట్టించుకోకుండా తన చాంబర్‌ను ఫంక్షన్‌హాల్‌గా మార్చుకుని పుట్టిన రోజు వేడుకల నిర్వహించుకోవడం, సిబ్బంది నుంచి కానుకలు పొందడాన్ని ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించింది. బర్త్‌డే వేడుకలకు కొన్ని గంటల ముందు నవీపేట్‌కు చెందిన ఓ వ్యక్తి ఫిట్స్ వచ్చిన తన భార్యను చికిత్స కోసం భుజాన వేసుకుని దవాఖాన మొత్తం తిరిగినా ఎవరూ పట్టించుకోలేదు. వైద్యం కోసం ఓ రోగి అల్లాడిపోయిన ఈ ఆ ఉదంతంపై ఎమ్మెల్యేలు సైతం ఫిర్యాదు చేయడంతో ప్రభుత్వం సీరియస్ అయ్యింది. దవాఖాన సూపరింటెండెంట్‌ను బాధ్యతల నుంచి తప్పిస్తూ ప్రభుత్వ కార్యదర్శి క్రిస్టినా జడ్ చోంగ్తు సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇన్‌చార్జి సూపరింటెండెంట్‌గా పీడియాట్రిక్ విభాగాధిపతి ప్రొఫెసర్ శ్రీనివాస్‌కు బాధ్యతలు అప్పగించారు.

# నిజామాబాద్ కేంద్రంగా పసుపుబోర్డు

## నేడు వర్చువల్‌గా ప్రారంభించనున్న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్




ఖలీల్‌వాడి, జనవరి 13: నిజామాబాద్ జిల్లా కేంద్రంగా ఏర్పాటు చేయనున్న జాతీయ పసుపుబోర్డును నేడు (మంగళవారం) ప్రారంభించనున్నట్లు కేంద్ర ప్రభుత్వం సోమవారం ప్రకటించింది. జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేట్ హోటల్‌లో ఏర్పాటు చేయనున్న ఈ కార్యక్రమాన్ని కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ వర్చువల్‌గా ప్రారంభించనున్నారు. పసుపుబోర్డు చైర్మన్‌గా అంకాపూర్‌కు చెందిన పల్లె గంగారెడ్డిని నియమిస్తూ కేంద్రం నోటిఫికేషన్ జారీ చేసింది. మూడేండ్ల పాటు ఆయన పదవిలో కొనసాగుతారని పేర్కొన్నది. మరోవైపు, పసుపు బోర్డు ఏర్పాటు స్థలం ఎక్కడో నిర్ణయించక ముందే ప్రైవేట్ హోటల్ వేదికగా ప్రారంభించడం చర్చనీయాంశంగా మారింది.














